క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్షా కాలం



ఎండలో తలపై అట్టపెట్టుకుని నడుస్తున్న విద్యార్థినులు

సాలూరు: పట్టణ సమీపంలో మిట్టమధ్యాహ్నం పలువురు విద్యార్థులు ఎండలో తలపై అట్టలను అడ్డుపెట్టుకుని నడిచి వెళ్తుండడం కనిపించింది.ఎందుకు ఇలా వెళ్తున్నారా? అని అడగ్గా, పీఎస్‌బొడ్డవలస గురుకుల పాఠశాల నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి వస్తున్నామని తెలిపారు. తాము స్థానిక బంగారమ్మ కాలనీలో ఉన్న ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటున్నామన్నారు. సుమారు 4 కి.మీ. నడుచుకుంటూ వెళ్తూ ఎండవేడికి ఆపసోపాలు పడడం కనిపించింది.కాగా ఓ వైపు పరీక్షల ఒత్తిడి మరోవైపు ఈ ఎండ వేడి కారణంగా శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు.

మహిళాదినోత్సవ స్ఫూర్తిని కొనసాగిద్దాం



సాలూరులో నిర్వహిస్తున్న ర్యాలీ

సాలూరు: మహిళాదినోత్సవ స్ఫూర్తిని ప్రతిరోజూ కొనసాగించాలని మెప్మా అధికారులు తెలిపారు. ఈ మేరకు అంతర్జాతీయ మహిళాదినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం సాలూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళల భద్రత, రక్షణ, సమానత్వం, అభివృద్ధి, సాధికారతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వాటికోసం కృషి చేయాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఎంఎం పుష్ప, మున్సిపల్ సిబ్బంది, ఆర్‌పీలు, నీడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ వేణుగోపాలరావు, మహిళాసంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల మరణాలపై అసెంబ్లీలో చర్చించాలి



పాలక రంజిత్ కుమార్

పార్వతీపురంటౌన్: గిరిజన విద్యార్థుల మరణాలపై అసెంబ్లీలో చర్చించాలని గిరిజన సంఘాల నాయకుడు పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో గల గిరిజన విద్యా సంస్థల్లో ప్రతి సంవత్సరం జరుగుతునన్న మరణాలకు కారణాలు తెలుసుకోవాలని కోరారు. గిరిజన మంత్రి మొదటి సంతకం చేసిన వసతి గృహాల్లో ఏఎన్ఎంల నియామకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.


ఘనంగా లక్ష్మీనృసింహ స్వామికి ముడుపులపూజలు



కనకాంబరాలతో అలంకరించిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామికి భక్తులు గురువారం ముడుపుల పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో నిర్వహించిన ముడుపుల పూజా కార్యక్రమం నిమిత్తం దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆలయ ప్రాంగణంలో క్యూకట్టి ముడుపుల పూజలు అభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. ముడుపుల పూజా కార్యక్రమాల్లో జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు సిర్లి పండగ



పట్టణంలో పూలజంగిడిని ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

పార్వతీపురంటౌన్: పట్టణంలో శుక్రవారం సిర్లి పండగ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. స్థానిక దుర్గ చెట్టు వద్ద ఉన్న పోతన్న, ఎల్లమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు ఈ సందర్భంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. పండగ సందర్భంగా పూలజంగిడిని గురువారం పట్టణంలో భక్తి శ్రద్ధలతో ఊరేగించారు.

పాడికి శ్రేయస్కరం
గడ్డి పెంపకం

- వేసవి దృష్ట్యా సాగు చేయాలంటున్న అధికారులు
- సబ్సిడీ కింద గడ్డి విత్తనాలు అందజేత



రైతులు పెంచుతున్న గడ్డి

బలిజిపేట: గ్రామాల్లో రైతులు పాడి పశువులను ఆధారంగా చేసుకుని జీవనం సాగిస్తుంటారు. ఆ పశువులకు మేతగా గ్రామాల్లో చాలామంది రైతులు వ్యవసాయ పొలాలు, బీడు భూములు, చెరువుల్లో దొరికే పశుగ్రాసం(గడ్డి)పై ఆధారపడుతుంటారు. వేసవికాలంలో, వర్షాకాలంలో గడ్డి దొరక్క నానా తంటాలు పడుతుంటారు. పాడిరైతులు రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని తమకు ఉన్న భూమిలో కొంత భూమిని పశుగ్రాసానికి కేటాయిస్తే మంచిది. ముఖ్యంగా పశుసంవర్ధక శాఖ అధికారులు సూచించిన ఆఫ్రికన్ టాల్ మెయిల్స్, సీఎస్‌హెచ్ 24, ఏపీడీఎం, కోవెరైటీ గడ్డి పెంచుకోవడం పాడిపశువులకు ఎంతో శ్రేయస్కరం. ఈ రకాలు నీటి ఎద్దడిని తట్టుకుంటాయి. అదే కాకుండా పశుగ్రాసం మంచి దిగుబడి వస్తుంది. అలాగే పాడి పశువులకు పశుగ్రాసం అందుబాటులో ఉండి సమయం ప్రకారం మేత ఇవ్వచ్చు. బలిజిపేట మండలంలో గేదెలు 550, ఆవులు, ఎద్దులు 18,500 ఉన్నాయి. మండలంలో ఇప్పటికే 50 ఎకరాల్లో గడ్డి పండిస్తున్నారు. ఇదికాక మరో 50ఎకరాల్లో గడ్డి పండించేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా ప్రతిపాదనలు చేశారు. వాటిలో చాలామంది రైతులు పశువులను మేపలేక వ్యాపారులకు అమ్ముకుంటూ ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

చిన్నకుటుంబాలకు పాడి పశువులే ఆధారం

అధికశాతం గ్రామాల్లో చిన్న కుటుంబాలు పాడి పశువులపైనే ఆధారపడుతుంటాయి,. ముఖ్యంగా వేసవికాలం, వర్షాకాలంలో పశుగ్రాసం కొరత అధికంగా ఉంటుంది. దీంతో పాడిరైతులు ఇక్కట్లు పడాల్సి వస్తుంది. వర్షాకాలంలోనూ గడ్డి లభ్యం కాని పరిస్థితులు ఉంటాయి. అలాంటి సమయాల్లో కొంత భూమిలో గడ్డిపెంపకం ఎంతో మేలు చేస్తుందని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. పశుపోషకులకు పశుగ్రాసం కొరత లేకుండా చేయడానికి పలు కార్యక్రమాలు చేస్తున్నా మారుమూల గ్రామాల్లో కార్యాచరణ దాల్చడం లేదనేది వాస్తవం.

పశుగ్రాసంలో రకాలు

జనుము: ఇది కాయజాతి పశుగ్రాసం. అన్ని నేలల్లోనూ అన్ని కాలాల్లో కొద్దిపాటి నీటితో కూడా పండించుకోవచ్చు. ఎకరాకు 12కిలోల విత్తనాలను 50కిలోల సూపర్ పాస్ఫేట్‌తో కలిపి చల్లాలి. విత్తిన తరువాత 40, 50రోజులకు కోతకు వస్తుంది. ఈ మేతను పూత దశలో కోసి ఎండుమేతగా వినియోగించుకోవచ్చు. ఇది అంతర పంటగా కూడా వేసుకోవచ్చు. భూసారానికి ఎంతో మేలుచేస్తుంది.

పిల్లిపెసర: వరిసాగు చేసే అన్ని భూముల్లో అంతర పంటగా దీన్ని సాగుచేసుకోవచ్చు. సాధారణ భూములకు పచ్చిరొట్టగా వాడితే భూమికి బలం చేకూరుతుంది. శీతాకాలంలో రబీ పంటగా ఈ పశుగ్రాసాన్ని సాగు చేసుకోవచ్చు. ఈ పశుగ్రాసం వేర్లలో నత్రజని బుడిపెలు ఉండడం వల్ల భూమి సారవంతమవుతుంది. వరిపంట కోయడానికి 3, 4 రోజుల ముందు అంటే భూమిలో తేమ ఉన్నప్పుడే ఎకరాకు 10-15కిలోల విత్తనాలను 50కిలోల సూపర్ పాస్ఫేట్‌తో కలిపి చల్లుకోవాలి. 50రోజుల్లో కోతకు వచ్చే ఈ పశుగ్రాసం వల్ల ఎకరాకు 10 నుంచి 12టన్నుల పచ్చిమేత లభిస్తుంది.

ఇతర రకాలు: ఇక పశుగ్రాసం కో-1, కో-2, హైబ్రిడ్ నాపియర్ (బహువార్షిక పశుగ్రాసాలు), మొక్కజొన్నలో ఆఫ్రికన్ టాల్ రకం జె-1006 రకం, విజయ కాంపోజిట్ రకాలు 85రోజులకు ఒకసారి కోతకు వస్తాయి. పండ్ల తోటలు, పామాయిల్ తోటల్లో కూడా సాగు చేసుకోవచ్చు. రైతులకు అధిక పశుగ్రాస దిగుబడులను అందిస్తాయి. పప్పుజాతి రకాలైన అలసంద(బొబ్బర్లు) రష్యన్ జైంట్, బుందేల్ లోబియ 1,2, ఈసీ-4216, 5287, కేబీసీ-2 మొదలైన రకాలు 55 నుంచి 60 రోజుల్లో ఒకే కోతలో నాణ్యమైన పశుగ్రాసాన్ని అందిస్తాయి.

పశుగ్రాసం పెంచడం అవసరం



“పాడిరైతులకు పశుగ్రాసం పెంచడం ఎంతో అవసరం. ప్రభుత్వం సహకారం అందిస్తుంది. మండల పరిధిలో ఎక్కువగా బహువార్షిక పశుగ్రాసానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏకవార్షిక పశుగ్రాసాలు పెంచుకుంటే మంచిది.

– గణేష్, మండల పశువైద్యాధికారి, బలిజిపేట మండలం

మున్సిపల్ కార్మికులందరినీ క్రమబద్ధీకరించండి



కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలోని పురపాలక సంఘాలలో ఉన్న ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కమిటీ నాయకుడు మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఆప్కాస్‌ను రద్దు చేస్తున్నప్పుడు అంతకన్నా మెరుగైన జీవన విధానాన్ని కార్మికులకు అందించాలని కూటమి ప్రభుత్వం అలా చేయకుండా కాంట్రాక్టర్ల చెప్పు చేతుల్లోకి కార్మికులను నెట్టాలని చూస్తే మరో పోరాటానికి వెనుకాడబోమని హెచ్చరించారు. సాలూరు పట్టణంలో శ్యామలంబ పండగ దృష్ట్యా కార్మికులకు సెలవులు ఇవ్వాలని జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని జీఓ నంబర్ 36 అమలు చేసి ఇంజినీరింగ్ కార్మికులు, డ్రైవర్ల వేతనాలు జీఓ ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కమిటీ నాయకుడు మల్లేష్, సింహాచలం, రాముడు శంకర్, మహిళా కమిటీ జిల్లా నాయకులు ఇందు, నిర్మల, రవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణారావు, కోశాధికారి జి. వెంకటరమణ, నాయకులు సూరిబాబు, పాలకొండ, పార్వతీపురం, సాలూరు మున్సిపాల్టీల కార్మికులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి వాలీబాల్ పోటీలు డీఎస్పీ రాంబాబు

గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట సర్కిల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలోని మైదానంలో వాలీబాల్ క్రీడాపోటీలను పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు గురువారం ప్రారంభించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు, క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. అనంతరం క్రీడాపోటీల్లో పాల్గొనే జట్లకు శుభాకాంక్షలు తెలిపారు. క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతిఒక్కరూ క్రీడాస్ఫూర్తి కనబరచాలని కోరారు. క్రీడల్లో ఎంతోమంది రాణించి ఉన్నతమైన స్థానాల్లో స్థిరపడ్డారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను కూడా నిరుద్యోగ యువతకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ హరి, ఎస్‌ఐలు శివప్రసాద్, నారాయణరావు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలకు లోబడి ప్రహరీల నిర్మాణం



మాట్లాడుతున్న ఎంపీడీఓ పి.త్రివిక్రమ రావు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో గల పాఠశాలల్లో జరుగుతున్న ప్రహరీల పనులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నిర్వాహకులు చేపట్టాలని ఎంపీడీఓ పి. త్రివిక్రమరావు అన్నారు. ఈ మేరకు జోగింపేటకాలనీలో గల డిపెప్ పాఠశాలకు నిర్మిస్తున్న ప్రహరీ పునాదులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ విద్యాలయాలు, ఆస్పత్రుల రక్షణకోసం ప్రహరీల నిర్మాణానికి నిధులు మంజూరుచేసిందన్నారు. నిర్వాహకులు నిర్దేశించిన గడువులోగా పనుతుల పూర్తి చేయాలని, పూర్తిచేసిన వారికి ఉపాధిహామీ పథకం నిధులతో బిల్లుల చెల్లింపు చేయనున్నట్లు తెలియజేశారు. ఇప్పటికే ఉపాధిహామీ పథకం ఏపీఓ భాను, ఇంజినీర్ కృష్ణ, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పరిశీలిస్తున్నారని తెలియజేశారు.

ఘనంగా లక్ష్మీనృసింహ స్వామికి ముడుపులపూజలు

సీతానగరం: మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహ స్వామికి భక్తులు గురువారం ముడుపుల పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో నిర్వహించిన పూజా కార్యక్రమం నిమిత్తం దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఆలయ ప్రాంగణంలో క్యూకట్టి ముడుపుల పూజలు అభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు.

వ్యవసాయ కార్మికుల వలసలు ఆపండి



సమావేశంలో మాట్లాడుతుసన్న సీపీఐ జిల్లా కార్యదర్శి తోట జీవన్న

పార్వతీపురంటౌన్: వ్యవసాయ కార్మికులు పోయే వలసలను జిల్లా అధికారులు చొరవ చేసుకొని నివారించాలని సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు తోట జీవన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు లేక పార్వతీపురం మన్యం జిల్లా నుంచి పెద్ద ఎత్తున వ్యవసాయ కార్మికులు వలస పోతున్నారన్నారు. వలసలు తీవ్రమవుతున్నా, గ్రామాల్లో వేలాది పేద కుటుంబాల వలసలు వెళ్తున్నా జిల్లా అధికారులు స్పందించడం లేదన్నారు. ఈ ఏడాదిలో చేసిన ఉపాధి పనులకు 5,6 వారాలుగా బిల్లులు ఇవ్వకపోవడంతో వ్యవసాయ కార్మికులు కుటుంబాలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి బకాయి బిల్లులన్నిటిని పోస్టాఫీస్ ద్వారా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గరుగుబిల్లి సూరయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొత్స మోహన్ పాల్గొన్నారు.

విలీనం ఆలోచన వద్దు ప్లీజ్..!



బగ్గందొరవలసలో మాట్లాడుతున్న పేరెంట్స్



బల్లకృష్ణాపురంలో అభిప్రాయ సేకరణ చేస్తున్న ఎంఈఓ జి.సూరిదేముడు

సీతానగరం: మండలంలోని బల్లకృష్ణాపురం, బగ్గందొరవలసలలోని ప్రాథమిక పాఠశాలలను గెడ్డలుప్పి ప్రాథమికోన్నత పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆయాగ్రామాల పేరెంట్స్‌తో పాటు ఎస్ఎంసీ సభ్యులు, గ్రామస్తులు ఏకవాక్య తీర్మానం చేశారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటు ప్రక్రియలో భాగంగా గురువారం చిన్నారాయుడుపేట పాపమ్మ వలస, నిడగల్లు డిపెప్, పెదభోగిలి పాఠశాలల్లో ఎంఈఓ 1 జి.సూరిదేముడు, ఎంఈఓ 2 వెంకటరమణ ఆయాపాఠశాలల్లో ఎస్ఎంసీ, గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయ సేకరణ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ప్రభుత్వం మోడల్ ప్రైమరీ పాఠశాలలు ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో కొన్ని పాఠశాలలను విలీనం చేయడానికి పేరెంట్స్ అభిప్రాయాలను తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో పేరెంట్స్ కొందరు మాట్లాడుతూ బగ్గందొరవలస, బల్లకృష్ణాపురం గ్రామాలనుంచి విద్యార్థులు సువర్ణముఖి నదిదాటి నిరంతరం వందలాది వాహనాలు తిరుగాడే రాష్ట్ర హైవేరోడ్డు దాటి వెళ్లాల్సి రావడం వల్ల పిల్లలకు భద్రత ఉండదని ఆందోళన వెలిబుచ్చారు. గ్రామాల్లో దశాబ్దాల కాలంగా ఉన్న పాఠశాలల విలీనాన్ని తల్లిదండ్రులు తీవ్రంగా వ్యతిరేకించడంపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు ఎంఈఓలు తెలిపారు.

జీడి, మామిడి రైతుల జిల్లా సదస్సును విజయవంతం చేయండి



పెద్దింపేటలో ప్రచారం చేస్తున్న రైతులు

బలిజిపేట: ఈనెల 10వ తేదీన లేవిడి గ్రామం వద్ద నిర్వహించనున్న జీడి, మామిడి రైతుల జిల్లా సదస్సును విజయవంతం చేయాలని సంఘం జిల్లా కోశాధికారి బొత్స గౌరునాయుడు పిలుపునిచ్చారు.ఈ మేరకు బలిజిపేట మండలంలోని పెద్దింపేట, గౌరీపురం, పోలినాయుడువలస గ్రామాల్లో రైతులను కలిసి జీడి, మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి వాటిని పరిష్కరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు తలపెట్టిన కార్యక్రమంపై తప్పక హాజరుకావాలని కోరారు. గత మూడు సంవత్సరాలుగా జీడి, మామిడి పంట రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, జీడి పిక్కలకు తగిన మద్దతు ధర లేకపోవడం, వర్తకులు, దళారుల కబంధ హస్తాల్లో చిక్కుకుని తీవ్రంగా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు మద్దతు ధర కల్పించాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా పంటను కొనుగోలు చేయాలనే డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు, ఎ.గౌరునాయుడు, కె.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివి అత్యున్నత స్థాయికి ఎదగాలి



స్టేషన్ నిర్వహణ పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



బలిజిపేట పోలీస్‌స్టేషనులో విద్యార్థినులకు ఓపెన్ హౌస్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై సింహాచలం

పార్వతీపురం రూరల్: అన్ని రంగాల్లో రాణించేందుకు చదువే ప్రాధాన్యమని రూరల్ ఎస్సై బి.సంతోషి విద్యార్థులకు హితవు పలికారు. బాగా చదివి అత్యున్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా చిన్నారులకు పోలీసులు పార్వతీపురం రూరల్ స్టేషన్‌లో నిత్యం నిర్వహిస్తున్న విధులపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై బి.సంతోషి మాట్లాడుతూ మహిళా సాధికార వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోలీస్‌స్టేషన్‌లో స్టేషన్ నిర్వహణ, లాకప్, సాంకేతిక నిర్వహణ, ఆయుధాల వినియోగంపై ఓపెన్ హౌస్ నిర్వహించినట్లు తెలిపారు. అలాగే పోలీసు అధికారుల పేర్లు, వారి స్థాయి వివరాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రూరల్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ హౌస్‌పై అవగాహన

బలిజిపేట: ప్రతి విద్యార్థికి ఓపెన్ హౌస్‌పై అవగాహన అవసరమని ఎస్సై సింహాచలం అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా బలిజిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం విద్యార్థినులకు ఓపెన్ హౌస్‌పై అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పోలీస్‌శాఖ పరంగా 1వ తేదీన మెడికల్ క్యాంప్, 2వ తేదీన కల్చరల్ ప్రోగ్రాం, 3న వ్యాసరచన పోటీలు, 4వ తేదీన డిబేట్, 5వ తేదీన పెయింటింగ్, 6వ తేదీన ఓపెన్ హౌస్ కార్యక్రమాలను నిర్వహించినట్లు ఎస్సై సింహాచలం తెలిపారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయరా?



సమావేశంలో మాట్లాడుతున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు

పార్వతీపురంటౌన్: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని, అగ్రిగోల్డ్ ఆస్తుల పరిరక్షణకు సమర్థ కమిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు, జిల్లా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆర్‌వీఎస్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం పార్వతీపురంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంపదను దోచుకుంటున్న వారిని అరెస్టు చేసి, వారి నుంచి సొమ్ము రికవరీ చేయాలని కోరారు. ఎనిమిది రాష్ట్రాలలో 32 లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారని గుర్తుచేశారు. 2015లో ఆస్తులను ప్రభుత్వం అటాచ్ చేసిందని, నాటి నుంచి అసోసియేషన్ నిరవధిక పోరాటం చేస్తున్నా ఫలితం కనిపించడం లేదని వాపోయారు. అగ్రిగోల్డ్ మూతపడి 11 ఏళ్లుకాగా, 23వేల ఎకరాల భూములను సీఐడీ స్వాధీనం చేసుకుందన్నారు. అగ్రిగోల్డ్ బాధిత రాష్ట్ర అసోసియేషన్‌కు ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇచ్చి అగ్రిగోల్డ్ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎన్‌ఆర్‌సీ కేంద్రంలో శిక్షణను సద్వినియోగం చేసుకోండి



ఎన్ఆర్‌సీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: పోషకాహార పునరావాస కేంద్రంలో పీహెచ్‌సీ స్టాఫ్ నర్సులకు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వైద్యబృందంతో కలిసి ఆయన పర్యవేక్షణ చేశారు. ఎన్‌ఆర్‌సీ కేంద్రంలో అడ్మిట్ అయిన పిల్లల బరువు, ఎదుగుదల వివరాలను పరిశీలించి గతానికి, ఇప్పటికీ ఎంత మేర పురోగతి ఉందో తెలుసుకున్నారు. ఏఏ ప్రాంతాల నుంచి వచ్చారో తల్లిదండ్రులతో మాట్లాడి వైద్య, అంగన్వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలపై ప్రశ్నించారు. పీహెచ్‌సీ స్టాఫ్‌నర్సులకు సాధారణ ప్రసవాలపై గైనకాలజీ విభాగంలో నిర్వహించిన రీఓరియంటేషన్ శిక్షణను పర్యవేక్షించారు. పర్యవేక్షణలో డీపీహెచ్ఎన్ఓ కె.ఉషారాణి, డెమో సన్యాసిరావు, ఈఓ సత్తిబాబు తదితరులున్నారు.

రక్తహీనత నివారణపై దృష్టిసారించండి



సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా సహాయ మలేరియా నివారణ అతధికారి సూర్యనారాయణ

కొమరాడ: రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి సూర్యనారాయణ సూచించారు. మండలంలోని రాజ్యలక్ష్మీపురంలో నిర్వహిస్తున్న ఎఫ్‌డీపీ కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొని, కాసేపు మాట్లాడారు. ఏజెన్సీ గ్రామాల్లోని గర్భిణులు రక్తహీనత బారినపడడానికి మలేరియా క్రిమి కూడా ఓ కారణమేనన్నారు. ఆ క్రిమి ప్రధానంగా ఎర్రరక్త కణాలపై దాడి చేస్తుందని, దాంతో రక్తహీనత బారినపడతామన్నారు. అందరూ ఇళ్ల ముందు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ముఖ్యంగా దోమలకు ఆవాసమైన మురుగునీటి నిల్వలలను తొలగించుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం పక్కాగా నిర్వహించి, పరిసరాలు పొడిగా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట వైద్యులు అరుణ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

పీ 4 సర్వేపై శిక్షణ

వీరఘట్టం: పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీ-4) సర్వేపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సర్వేపై ఎంపీడీఓ బి. వెంకటరమణ పలు సూచనలు చేశారు.